సాక్షి
అనంతపురం
శనివారం। 1। మార్చి। 2025



చీనీ టన్ను రూ.21,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,100 పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 36.8°/15.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గుతుండగా.. ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'గాలికుంటు', బ్రూసెల్లోసిస్ టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం ఆరవ విడత ఎన్‌ఏడీసీపీ పథకంలో భాగంగా పశువుల్లో గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజెస్–ఎఫ్ఎండీ) నివారణకు శనివారం నుంచి మార్చి నెలాఖరు వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎన్.రామచంద్ర తెలిపారు. అలాగే 4 నుంచి 8 నెలల వయసున్న దూడల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు శనివారం నుంచి నెలాఖరు వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. అందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువుల ఆస్పత్రులకు ఇప్పటికే మందులు సరఫరా చేశామన్నారు.

అనంతకు విచ్చేసిన హోం మంత్రి అనిత

అనంతపురం: రాష్ట్ర హోం మంత్రి అనిత శుక్రవారం రాత్రి అనంతపురం విచ్చేశారు. పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 2024–బ్యాచ్ ఎస్ఐలకు సంబంధించి శనివారం నిర్వహించే పాసింగ్ అవుట్‌పరేడ్‌లో హోం మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన పోలీస్ కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. అనంతరం శనివారం సాయంత్రం 4 గంటలకు తిరిగి బెంగళూరు వెళ్తారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో అగ్రస్థానం




మొబైల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మొబైల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే అనంతపురం జిల్లా అగ్రస్థానంలో ఉందని ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. చాట్‌బాట్ ద్వారా అందిన ఫిర్యాదుల ఆధారంగా రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల పంపిణీ మేళా శుక్రవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై రికవరీ చేసిన రూ.2.95 కోట్లు విలువ చేసే 1,183 మొబైల్ ఫోన్లను అందజేశారు. ఇప్పటి వరకు జిల్లాల వారీగా అనంతపురం 7512, శ్రీసత్యసాయి 1120, కర్నూలు 614, వైఎస్సార్ 412, చిత్తూరు 97, గుంటూరు 87, తిరుపతి 55, నెల్లూరు 53, తూర్పు గోదావరి 38, ప్రకాశం 36, కృష్ణా 35, పశ్చిమగోదావరి 33, విజయవాడ 28, విజయనగరం 21, కాకినాడ 18, శ్రీకాకుళం 16, ఏలూరు 12, ఒంగోలు 9, విశాఖపట్నం 7 చొప్పున మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. అలాగే రాష్ట్రాల వారీగా కర్ణాటక 427, తెలంగాణ 389, కేరళ 93, తమిళనాడు 73, మహారాష్ట్ర 60, పశ్చిమబెంగాల్ 39, ఉత్తరప్రదేశ్ 19, బిహార్ 15, అసోం 13, రాజస్థాన్ 11, ఒడిశా 9, గుజరాత్ 8, మధ్యప్రదేశ్ 5, హర్యానా 3, జమ్మూకశ్మీర్ 3, చత్తీస్‌ఘడ్ 2, జార్ఖండ్ 2, డెహ్రాడూన్ 1, ఢిల్లీ 1, పంజాబ్ 1 చొప్పున సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందించినట్లు చెప్పారు. అనంతపురం నుంచి ప్రారంభించిన చాట్‌బాట్ సేవలను దేశవ్యాప్తంగా బాధితులు వినియోగించుకుంటున్నారన్నారు.

అనంతకు అడియాసే

అరకొర నిధులు.. అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ రంగానికీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు.. ఇలా ఏ వర్గానికీ సాయంగా నిలవలేకపోయింది. చివరకు సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పిన పథకాలనూ విస్మరించడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన సొంత జిల్లా అనంతపురంపైనా మమకారం చూపలేకపోయారు.



- ఉమ్మడి జిల్లాను పట్టించుకోని పయ్యావుల
- హంద్రీ–నీవా ఆయకట్టు స్థిరీకరణకు రిక్తహస్తం
- లైనింగ్‌కు మాత్రమే నిధులివ్వడంపై విమర్శలు
- హెచ్చెల్సీ ఆధునికీకరణకు అత్తెసరు నిధులు
- కూటమి బడ్జెట్‌పై అన్ని వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత

అరకొర కేటాయింపులు



సీఎం చంద్రబాబు మోసం, కుట్రపూరిత నైజం మరోసారి బహిర్గతమైంది. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడిని తలపిస్తోంది. సూపర్ సిక్స్ హామీలకు చిల్లు పెట్టారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని చెబుతూనే బడ్జెట్‌లో అరకొరగా కేటాయింపులు చేశారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 సాయం అందించే పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటన గురించి ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి ఊసే మర్చిపోయారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే యోగం ఈ ఏడాది కూడా లేనట్టే. ఎన్నికల సమయంలో జగన్ కన్నా.. ఎక్కువ సంక్షేమం అందిస్తామని నమ్మించి ఓటేయించుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చివరకు వారి మేనిఫెస్టోలోని హామీలనే అమలు చేయలేని పరిస్థితికి వచ్చారు.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం: రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి సర్కారు శుక్రవారం పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశపరిచింది. తమ జీవితాల్లో వెలుగులు నింపే బడ్జెట్ ప్రవేశపెడతారని భావించిన వారి ఆశలు ఆవిరయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి అయిన హంద్రీ–నీవాకు కేటాయించిన రూ.3,243 కోట్లలో విద్యుత్ బిల్లులకే రూ.1,000 కోట్లు పోతుంది. హంద్రీ–నీవా పరిధిలోని ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నయాపైసా నిధులు కేటాయించలేదు. కేవలం లైనింగ్ పనుల రూపంలో నిధులు దండుకోవడమే లక్ష్యంగా కేటాయింపులు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుప్పంకు నీళ్ల తీసుకెళ్లడం కోసం హంద్రీ–నీవా లైనింగ్ పూర్తి చేయాలనే పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు అన్యాయం చేసే ఎత్తుగడ ఇది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీ–నీవా ఆయకట్టు స్థిరీకరణను విస్మరించి రైతులను దగా చేశారు. హెచ్చెల్సీ ఫేజ్–1, ఫేజ్–2కు కలిపి మొత్తం రూ.70 కోట్ల నిధులు మాత్రమే కేటాయించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణకు రూ.వందల కోట్ల నిధులు అవసరం కాగా.. అత్తెసరు నిధులు కేటాయించి అనంత రైతుకు తీరని వేదన మిగిల్చారు.

ఎన్నికల హామీలు గాలికి..

ఎన్నికల హామీలను కూటమి సర్కార్ గాలికి వదిలేసింది. మహిళల మహాశక్తి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణాలకు పైసా ఇవ్వని ప్రభుత్వం.. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు భారీగా కోత విధించింది. అన్నదాత సుఖీభవ పథకానికి గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించినా.. నయాపైసా విడుదల చేయలేదు. ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని హామీలో పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.65 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే రూ.1,130 కోట్లు కావాలి. అయితే రాష్ట్రం మొత్తం మీద రూ.6,300 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకంలోనూ కోత తప్పనిసరి. తల్లికి వందనం పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.750 కోట్లు 'తల్లికి వందనం' కింద ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రమంతటికీ కలిపి రూ.9,407 కోట్లు కేటాయించారు. ఇందులోనూ కోత విధించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి:

ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయింపుల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.84 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. వారంతా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి భృతి ఇస్తారని వేయి కళ్లతో ఎదురుచూసినా.. చివరకు నిరాశ తప్పలేదు. ఉద్యోగాల భర్తీ ప్రస్తావనే లేకుండా ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

విద్యారంగానికి నిరాశే



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ విద్యా రంగానికి తీవ్ర నిరాశ కలిగించింది. ఉద్యోగులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ నిధుల గురించి గానీ, ఆర్థిక బకాయిల గురించి గానీ ప్రస్తావించలేదు. పీఆర్సీ అమలు చేసే వరకు ఐఆర్ ఇచ్చేందుకు కూడా ఎలాంటి నిధులూ కేటాయించలేదు. కొఠారి కమిషన్ చెప్పిన విధంగా బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించకపోవడం చూస్తే ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. మొత్తం బడ్జెట్‌లో 9.86 శాతం మాత్రమే ప్రాథమిక విద్యకు కేటాయించారు.

– సిరాజుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

సాగునీటికి నిధులు పెంచాలి



రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగానికి అవసరమైన నిధులు కేటాయించలేదు. జిల్లా సాగునీటి కోసం మరిన్ని నిధులు కేటాయించాలి. హంద్రీ–నీవా విద్యుత్ బిల్లులకే రూ.1,000 కోట్లు ఖర్చు అవుతుంది. ఉద్యోగుల వేతనాలకు పోగా, ప్రాజెక్టులకు మిగిలేది తక్కువే. ప్రజలకు భారంగా మారిన విద్యుత్ ట్రూఅప్ చార్జీల తగ్గింపు గురించి మాట్లాడకపోవడం అన్యాయం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు కేటాయించిన నిధులను బట్టి చూస్తే లబ్ధిదారుల సంఖ్యలో కోత పడేలా ఉంది.

– వి.రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

వ్యవసాయానికి నిధులు పెంచాలి



ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తుంటే రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పథకాలకు నిధుల కేటాయింపు లేకపోవడం, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి పైసా విదల్చకపోవడం అన్యాయం. బడ్జెట్‌లో వ్యవసాయానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

– ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

స్వాగతించదగిన బడ్జెట్



వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి దోహదపడే బడ్జెట్ ఇది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ఏపీని మరింత అభివృద్ధి చేసేలా కేటాయింపులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో గ్రామీణ రహదారులు, జాతీయ రహదారుల నిర్మాణానికి, పోలవరం, అమరాతి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుంది. డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలితమే ఈ బడ్జెట్. ఈ బడ్జెట్‌ను బీజేపీ స్వాగతిస్తోంది.

– కె.రాజేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులూ.. విజయోస్తు!

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు మొదటి సంవత్సరం, 3 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నెల 20 నాటికి ముగుస్తాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 48,690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 25,730 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,960 మంది ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి : పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేసింది. కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొత్తం 63 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 63 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతో పాటు 850 మందిని ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయం, విజయవాడలోని ఇంటర్ బోర్డ్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. అధికారులు కార్యాలయాల నుంచి లైవ్‌లో పర్యవేక్షించనున్నారు.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి : విద్యార్థులు ఇబ్బంది లేకుండా నిర్దేశిత సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ సూచించారు. 8.30 గంటల నుంచే ఓఎంఆర్ షీట్లు ఇస్తారన్నారు. 9 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించబోరని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్ తెచ్చుకోవాలన్నారు. పరీక్ష వేళల్లో బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. విద్యుత్ కోత లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తారన్నారు.

సైన్స్‌తోనే సమాజ మనుగడ



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజం మనుగడ సైన్స్‌పై ఆధారపడి ఉందని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ మానవుని మనుగడ శాంతంగా, ఆనందంగా కొనసాగాలంటే సైన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేటి తరం విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా మారి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని గుర్తించి వెలికితీయడంలో ఉపాధ్యాయులు కీలకం అన్నారు. నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత, ఒక దేశ అభివద్ధిలో సైన్స్ పాత్ర గురించి పిల్లలకు విశదీకరించారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ విధానాన్ని ఎలా అలవరచుకోవాలి, సైన్సును ఆసక్తిగా ఎలా చదవాలో తెలియజేశారు. అనంతరం ఎన్‌జీసీ రీజనల్ కోఆర్డినేటర్ ఆనంద భాస్కర్‌రెడ్డి ఇప్పటిదాకా ప్రపంచ గతిని మార్చిన సైన్స్ ఆవిష్కరణలను తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ సైన్స్‌కు చెందిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

- తాపీ మేస్త్రీ మృతి



మృతుడు విజయ్

రాయదుర్గంటౌన్: ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన రాయదుర్గంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి తల్లి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌గాంధీ కాలనీ గ్యాస్ గోడౌన్ ఏరియాకు చెందిన తాపీమేస్త్రీ ఎస్.విజయ్ (28) గురువారం మధ్యాహ్నం కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు బళ్లారి రోడ్డులోని ఆర్ఎంపీ చన్నవీర వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ ఇంజక్షన్ వేసి దాదాపు 15 రకాల మందులు రాసినట్లు తల్లి లక్ష్మీదేవి తెలిపింది. మందులు తీసుకుని ఇంటికి వెళ్లగా సాయంత్రమైనా తగ్గకపోవడంతో మళ్లీ క్లినిక్ వద్దకు వస్తే సెలైన్ ఎక్కించి.. మరో 10 రకాల మందులు రాసిచ్చి.. అందులో ఒక నిద్రమాత్ర కూడా ఇచ్చినట్లు చెప్పింది. అప్పటి నుంచి తన కుమారుడు శుక్రవారం మధ్యాహ్నం వరకు ఉలుకు పలుకు లేదని తెలిపింది. శరీరంలో తేడా అనిపించడంతో శుక్రవారం రాత్రి 7 గంటలకు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తే.. అప్పటికే విజయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని లక్ష్మీదేవి చెప్పింది. తన కుమారుడి మృతికి ఆర్ఎంపీ చికిత్సే కారణమని ఆరోపించింది. ఐదు రోజుల క్రితం తన భర్త వెంకటేశులు గుండెపోటుతో మృతి చెందడంతో బెంగళూరులో తాపీమేస్త్రీగా పనిచేస్తున్న కుమారుడు విజయ్ రాయదుర్గం వచ్చాడని తెలిపింది. ఇప్పుడు కుమారుడు కూడా మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విజయ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కుమారుడి మృతికి కారణమైన ఆర్ఎంపీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు లక్ష్మీదేవి తెలిపింది.

నిబంధనల మేరకే ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు

అనంతపురం రూరల్: మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు గౌరవ వేతనం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇమాములు, మౌజన్లకు గౌరవ వేతనాలను మసీదు బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశామన్నారు. అయితే యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందించిన వారికి చెక్‌ల రూపంలో గౌరవ వేతనాలు అందిస్తామన్నారు. ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డులో రిజిష్టర్ అయిన మసీదులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. 15 రోజుల్లోపు మసీదు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలన్నారు.

పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పారిశ్రామికాభివృద్ధిపరంగా జిల్లాను అగ్రస్థానంలో నిలపడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా రుణ మంజూరులో జాప్యం చేయవద్దని సూచించారు. స్టాండప్ ఇండియా పథకం కింద లబ్దిదారులకు రుణాలను త్వరగా మంజూరు చేయాలన్నారు. విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి శిక్షణ ఇవ్వడంతో పాటు రుణం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. అనంతరం ఇండస్ట్రియల్ పాలసీ కింద 18 యూనిట్లకు రూ.1.25 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీటీసీ వీర్రాజు, ఫ్యాక్టరీ అసిస్టెంట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎల్‌డీఎం నర్సింగరావు, ఏపీపీఎస్‌బీ ఈఈ మునిప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నగర్ అభివృద్ధికి సహకారం

గార్లదిన్నె: ట్రాక్టర్ నగర్‌ను మరింత అభివృద్ధి చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గార్లదిన్నె సమీపంలోని ట్రాక్టర్ నగర్ (దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ)ను సందర్శించారు. ట్రాక్టర్ నగర్‌లోని కంట్రోల్ రూం, టెస్ట్ ల్యాబ్, ఎడిషన్ ల్యాబ్, ప్రాసెసింగ్ ల్యాబ్, పవర్ టిల్లర్ ల్యాబ్, జనరల్ ఫ్రెండ్లీ ఎక్విప్‌మెంట్ ల్యాబ్, ఇంజిన్ కట్ సెక్షన్ ల్యాబ్, ఇతర విభాగాలను, ఫారంపాండ్‌లను కలెక్టర్ పరిశీలించారు. వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడ కోర్సులు పూర్తి చేసిన తరువాత ఉద్యోగావకాశాల గురించి ఆరా తీశారు. అనంతరం అధికారులతో నిర్వహించారు. ట్రాక్టర్ నగర్ వివరాలను ఆ సంస్థ డైరెక్టర్ బి.ఎం.నాందేడ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ట్రాక్టర్ నగర్‌కు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి

రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతపై కలెక్టర్ శుక్రవారం గార్లదిన్నె మండలం వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎస్పీ జగదీష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నట్లు గుర్తించిన 37 ప్రాంతాల్లో (బ్లాక్ స్పాట్) జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు 'అమ్మ' చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీ కొట్టాలలో నివసిస్తున్న రాధమ్మ కుటుంబానికి అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. రాధమ్మ భర్త వన్నూరప్ప ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. రాధమ్మ పాచిపనులు చేసుకుంటూ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని కలిశారు. చిన్నారుల చదువులకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అలాగే రూ.20 వేలు విలువ చేసే దుస్తులు, రూ.15 వేల కిరాణా సరుకులు అందించారు. అడిగిన వెంటనే స్పందించిన తరిమెల రమణారెడ్డికి రాధమ్మ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

బీటెక్ సిలబస్‌లో మార్పులు



మాట్లాడుతున్న వీసీ హెచ్.సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో బీటెక్ మూడు, నాలుగు సంవత్సరాలకు సంబంధించిన నూతన సిలబస్‌ను రూపకల్పన చేసినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ అనంతపురంలోని కాన్ఫరెన్స్ హాలులో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. మైనర్, హానరీ కోర్సులు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న తదితరులు పాల్గొన్నారు.

పాడి ఆవుకు శస్త్ర చికిత్స




శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్యశాల సహాయ సంచాలకులు జి.పద్మనాభం

రాప్తాడు: ఎం.బండమీదపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేష్‌కు చెందిన పాడి ఆవు కొన్ని రోజులుగా నడవలేక నొప్పితో బాధపడుతూ ఉండేది. స్థానిక వైద్యులు ఎన్ని మందులు ఇచ్చినా నొప్పి తగ్గలేదు. స్థానిక పశు వైద్యాధికారి సోమేశ్వరి వద్దకు వెళ్లి సమస్యను చెప్పుకున్నాడు. స్పందించిన ఆమె.. వెంటనే ఆవును తీసుకుని శింగనమలలో విధులు నిర్వహిస్తున్న ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు జి.పద్మనాభం వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. రైతు శుక్రవారం ఉదయం పాడి ఆవును ప్రత్యేక వాహనంలో శింగనమలకు తీసుకెళ్లాడు. ఆవును పరీక్షించిన ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు జి.పద్మనాభం వెంటనే ఆపరేషన్ చేశారు. శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు.

అంకెల గారడీ బడ్జెట్

కూటమి ప్రభుత్వం అంకెల గారడీ బడ్జెట్‌తో ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. బడ్జెట్‌పై ఎవరు ఏమన్నారో వారి మాటల్లోనే..

బడాయి బడ్జెట్



మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలనూ నిరాశపరిచింది. ఎన్నికల హామీలను గాలికొదిలేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి పథకాలకు బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. సంపద సృష్టి మాట దేవుడెరుగు... అప్పులు మాత్రం సృష్టించారు. అప్పులతోనే అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం సిద్దమైనట్లు స్పష్టమవుతోంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్నారు. తీరా బడ్జెట్‌లో నయాపైసా నిధులు కేటాయించలేదు. దీపం పథకానికి కోత విధించి 1.55 కోట్ల లబ్ధిదారులను 90 లక్షలకు కుదించి రూ.4వేల కోట్లకు గాను కేవలం రూ2,601 కోట్లు మాత్రమే కేటాయించారు. తల్లికి వందనం కింద రూ.25వేల కోట్లకు గాను కేవలం రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారు. డ్వాక్రా మహిళలకు రూ.10లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై స్పష్టత లేదు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇందుకు రూ10,400 కోట్లకు గాను బడ్జెట్‌లో రూ. 6,300 కోట్లు మాత్రమే కేటాయించి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లారు. గత ప్రభుత్వాన్ని విమర్శలు చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమంపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చూపలేదు. బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమ జిల్లాల ప్రస్తావన లేదు. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులపై సైతం కేశవ్ ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశపరిచింది. ఇది కేవలం కూటమి ప్రభుత్వ బడాయి బడ్జెట్‌గానే నిలిచింది.

– వై. విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

దగా చేశారు



భారీ అంచనాలతో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ చివరకు కోతల బడ్జెట్‌గానే మిగిలింది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మరోసారి అన్ని వర్గాల ప్రజలను దగా చేసింది. సంక్షేమం పేరుతో కోతలు వేశారు. దీపం పథకానికి సంబంధించి 1.55 కోట్ల మందికి అందాల్సిన లబ్ధిని భారీగా కుదించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలను ఇస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా చేశారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకంలో భారీగా కోతలు విధించి రూ.10,400 కోట్లకు గాను బడ్జెట్‌లో రూ.6,300 కోట్లను కేటాయించి రైతాంగాన్ని మోసం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలి.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

నిరాశజనకం



నిధులు కేటాయించకుండా పేద, బడుగు, బలహీన వర్గాల వారితో పాటు రైతులు, మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ఊసేలేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ నిధుల కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. ప్రస్తుత కేటాయింపులు ఏ మాత్రం సరిపోవు. 50 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళకు పెన్షన్ మంజూరు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. అన్నదాత సుఖీభవ పథకానికి కంటితుడుపు చర్యగా నిధులు కేటాయించారు. దీపం పథకాన్ని 90 లక్షల మందికే కుదించారు. సున్నా వడ్డీకి నిధులే లేవు. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇవి ఏ మాత్రమూ సరిపోవు. మొత్తానికి ఈ బడ్జెట్ అభివృద్ధి సూచికలో రాష్ట్ర తిరోగమనానికి నిదర్శనంగా నిలిచింది.

– వై. శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్

మభ్య పెట్టారు



ఎన్నికల వాగ్దానాల్లాగే ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కా ప్రణాళికతో బడ్జెట్‌ను రూపొందించి ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ నెరవేర్చారు. అయితే గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ ప్రజలను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉద్యోగాల కల్పన, తదితర వాటికి సంబంధించి నిధుల కేటాయింపులో స్పష్టత లేదు. విద్యారంగానికి రూ.30 వేల కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. ఉద్యోగుల జీతాలు ఉన్నాయో లేదో చెప్పలేదు. తల్లికి వందనం పథకం అమలుకు ఏటా రూ.13వేల కోట్లు అవసరం కాగా, రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారు. మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామన్న హామీ అమలు ఊసేలేదు. పింఛన్లు ఇస్తున్నామని చెబుతూనే.. ఇప్పటికే 1.50 లక్షల మందిని అనర్హులుగా పేర్కొంటూ అక్రమంగా తొలగించారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి, ఇవాళ కేంద్రం నిధులను కలుపుకుని ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీ-నీవా కాలువ వెడల్పునకు చొరవ తీసుకోలేకపోయారు.

– సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారు



ప్రైవేట్ విద్యా సంస్థలు, మాల్స్, ప్రైవేట్ ఆస్పత్రులు, హోటళ్ల తదిర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 2006-07 నుంచి ఇప్పటి దాకా వేతనాలు పెంచలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 2వేల గ్రామాలకు పైగా తాగునీరు అందిస్తున్న నీలకంఠాపురం శ్రీరామరెడ్డి, శ్రీసత్యసాయి మంచినీటి పథకం ప్రాజెక్ట్‌లకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. సమ్మె చేస్తేనే కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉంది. కూటమి అధికారంలోకి రాగానే ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లిస్తామన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోతే ఎలా చెల్లిస్తారు? కార్మికుల వేతనాలు, సంక్షేమం కోసం బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– ఎస్.నాగేంద్ర కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

వేతన సవరణకు నిధులేవీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగుల వేతన సవరణకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం. ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక వాటిని అస్సలు పట్టించుకోవడం లేదు. కరువు భత్యం బకాయిలు ఇప్పటి దాకా చెల్లించకపోవడం ఉద్యోగుల సంక్షేమంపై సర్కారుకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం.

శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, -1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి?

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ, ఐఆర్ అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. సీపీఎస్/జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్లో ఎలాంటి ప్రకటనా లేదు. పాఠశాల విద్యకు గత సంవత్సరం 10.15 శాతం నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో 9.86కు కుదించేశారు.

– ఎస్.రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు

యాభై ఏళ్లకే పింఛన్ ఏమైంది?



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు యాభై ఏళ్లకే పింఛన్ అన్నారు. ఎన్నికల ప్రచార సభల్లోనూ పదే పదే చెప్పారు. దీంతో చాలా మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓట్లు వేశారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ ఊసే లేదు. మొన్న పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో లేదు. ఇప్పుడు ఈ బడ్జెట్‌లో లేదు. ఇదేనా మీ బడ్జెట్?

– రమేష్‌గౌడ్, టాస్క్‌ఫోర్స్ కమిటీ మెంబర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

నైతిక విలువలతోనే సమున్నత జీవితం

- పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువులు



సన్మానం అందుకున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువులు

అనంతపురం కల్చరల్: నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన జీవితం అలవరచుకుంటే ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువులన్నారు. శుక్రవారం అనంతపురంలోని లలితకళాపరిషత్తు వేదికగా 'భారతదేశం -మతసామరస్యం' అంశంపై సదస్సు జరిగింది. డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి అధ్యక్షత వహించారు. పీఠం పరిచయాన్ని రియాజుద్దీన్ చేశారు. పీఠంతో అనంతకు ఏర్పడిన బాంధవ్యాన్ని గుంటి మురళీకృష్ణ వివరించారు. పిఠాపురం నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సద్గురువు ఉమర్ ఆలీషా మాట్లాడుతూ.. అన్ని మతాల సారం ఒకటేనన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ మాట్లాడుతూ.. ఉత్తమ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ద్విభాషాకవి జూటూరు షరీఫ్, నగరూరు రసూల్, సాకే శ్రీహరిమూర్తి ఆత్మీయ వచనాలతో ఆకట్టుకున్నారు. అంతకు ముందు గురుస్తుతిపై సంధ్యామూర్తి శిష్యబృందం శాస్త్రీయ నృత్యంతో అలరించింది. ఈ సందర్భంగా జాతీయస్థాయి చిత్రకారుడు చింతా వెంకటేశ్వర్లు కుంచె నుంచి జాలువారిన గురుపరంపర చిత్రాన్ని, సైన్సు ఫేర్ విజేతలను స్వామీజీ, ఇతర అతిథులు అభినందించి బహుమతులందించారు. నా మొక్క నా శ్వాస పేరుతో అనంతను సుశ్యామలం చేయడానికి శ్రమిస్తున్న చిన్నారి నవనిని, ఆమె తల్లిదండ్రులను అభినందిస్తూ నగదు ప్రోత్సాహకంతో అభినందించారు. అనంతరం ఉమర్ ఆలీషా సద్గురువును అనంత సాహితీ సంస్థల ప్రతినిధులు, కళాకారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమితి సభ్యులు సుంకర రమేష్, డాక్టర్ నానీల నాగేంద్ర, చెట్ల ఈరన్న, శ్రీకాంత్, నెహ్రూ యువకేంద్రం డీడీఓ శ్రీనివాస్, బడా శ్రీనివాసరెడ్డి, హరికిషోర్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం కార్పొరేషన్: మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంబంధిత వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, గైనకాలజిస్టు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రత్యూష, అనస్తీషియా వైద్యులు డాక్టర్ జగదీష్, వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ బీవీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం



పాదయాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. డిమాండ్ల సాధనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రైతులను చైతన్య పరిచి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఈ నెల 7వ తేదీ నుంచి రైతుల పాదయాత్ర చేపట్టనున్నామని, 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక ఏపీ రైతు సంఘం కార్యాలయంలో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. 2024-25 ఖరీఫ్, రబీలో సాగు చేసిన మిరప, పత్తి, సీడ్‌జొన్న, పప్పుశనగ ఇలా ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఖరీఫ్, రబీలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా విడుదల చేయలేదన్నారు. అన్ని విధాలుగా ఇబ్బందికి గురవుతున్న రైతులను ప్రభుత్వం కనీసంగానూ ఆదుకునేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 7వ తేదీన ఉరవకొండలో రైతుల పాదయాత్ర ప్రారంభించి 10వ తేదీన కలెక్టరేట్ వద్దకు చేరుకుంటుందని, అక్కడ ధర్నాతో పాదయాత్ర ముగుస్తుందన్నారు. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని పాదయాత్రను, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీహెచ్‌రాయుడు, పోతులయ్య, చెన్నారెడ్డి, సంజీవరెడ్డి, గిరి వెంకట్రామిరెడ్డి, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అలకోత్సవం



అశ్వవాహనంపై పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో తొమ్మిది రోజులుగా సాగుతున్న మహాశివరాత్రి వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం కాశీవిశ్వేశ్వరుడు సతీ సమేతుడై అశ్వవాహనంపై ఊరేగి దర్శనమిచ్చాడు. అనంతరం సాగిన అలకోత్సవం భక్తులను ఆకర్షించింది. ఉదయం మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం దీక్షాహోమం, దశహారతులు జరిగాయి. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ.. శనివారం శివరాత్రి ఉత్సవాలు వసంతోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. శారదా మాత దేవస్థానంలో ముగింపు వేడుకలు జరుగుతాయని భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి



రాప్తాడు: ఎల్లార్జి పాఠశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మేయర్ వసీం



ఆత్మకూరు: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు



మినర్వా స్కూల్ విద్యార్థినులు తయారు చేసిన నమూనాలు

రాప్తాడు/ఆత్మకూరు/అనంతపురం రూరల్/అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లోని స్కూళ్లు, కళాశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సైన్స్ ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్ దోహద పడుతుందని అధ్యాపకులు సూచించారు. కళాశాలలు, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

క్రెడాయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్ ప్రదర్శన



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం నగర శివారులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్ ప్రదర్శన నిర్వహించారు. సంస్థ ప్రెసిడెంట్ బి.తిరుపాలు, ప్రధాన కార్యదర్శి నిట్‌కాన్ చంద్రశేఖర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రెడాయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్‌ను అనంతపురంలో 3వ సారి నిర్వహించినట్లు తెలిపారు. రూఫ్ బిల్డర్స్, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. ప్రజలు ఇంటి నిర్మాణం, ఇంటి స్థలం, బ్యాంకు లోన్ తదితర వివరాలు తెలుసుకొనేందుకు ఇలాంటి వేదికలు చాలా ఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రదర్శనలో దాదాపు 60 వరకు స్టాళ్లు ఏర్పాటు చేశారు.

ఎరా ఇంటర్నేషనల్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం రూరల్: ఇటీవల గోవాలో జరిగిన రోలర్ రిలే స్కేటింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. గోవాలోని మీరమ్మర్ బీచ్‌లో జరిగిన అండర్-4, 16 రోలర్ రిలే స్కేటింగ్ పోటీల్లో రెండు స్వర్ణాలు, 7 కాంస్యం, 9 రజత పతకాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఎస్‌ఈ, ఈఈ సేవలు అభినందనీయం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎస్‌ఈ భాస్కర్ రావు, ఈఈ రాధాకృష్ణ సేవలు అభినందనీయమని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌ఈ, ఈఈల ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. మేయర్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదన్నారు. డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ మోహన్, ఈఈ షాకీర్ హుస్సేన్, డీఈ నరసింహులు, ఆర్‌ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఎస్‌ఈగా చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎస్‌ఈగా చంద్రశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన తిరుపతి నగరపాలక సంస్థలో ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. బదిలీపై అనంతపురం నగరపాలక సంస్థకు రానున్నారు. అదేవిధంగా నగరపాలక సంస్థ కార్యదర్శిగా రంగస్వామిని నియమించారు. ప్రస్తుతం ఈయన మడకశిరలో మేనేజర్‌గా ఉన్న పదోన్నతిలో భాగంగా అనంతపురం రానున్నారు. అదేవిధంగా మడకశిర ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఎఫ్‌ఏసీ అదనపు బాధ్యతల్లోనూ రంగస్వామి కొనసాగనున్నారు. నగరపాలక సంస్థలో డీఈగా ఉన్న నరసింహకు ఇన్‌చార్జ్ ఈఈగా అవకాశం కల్పించారు.

సంక్షిప్త సమాచారం

నిందితుడిపై పోక్సో కేసు

అనంతపురం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తండ్రికి తోడుగా ఉన్న ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాంప్రసాద్ తెలిపిన వివరాలు.. మడకశిర మండలం యు.రంగాపురం నివాసి అయిన బుడెన్ సాబ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడికి తోడుగా ఆయన కొడుకు రిజ్వాన్ ఆసుపత్రిలోనే ఉన్నారు. ఈ క్రమంలో రిజ్వాన్ ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి, వేధించాడు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆర్కే ఫంక్షన్ హాలు వద్ద నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గతంలో రిజ్వాన్ ఓ హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నాడు.

'కార్మికులను వేధించడం తగదు'

అనంతపురం అర్బన్: కార్మికుల విషయంలో నియంతలా వ్యవహరిస్తున్న తాడిపత్రి మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు, కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, మునిసిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. కార్మికుల విషయంలో మునిసిపల్ కమిషనర్ అనుచితంగా వ్యవహరిస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

జేఎన్‌టీయూ వీసీకి సత్కారం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావును అటానమస్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల సమస్యలపై స్పందించరా?

అనంతపురం అర్బన్: శ్రీవెంకటేశ్వర పశువైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ ఎ.మలోలను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు రామకృష్ణ, బండి రామకృష్ణ, రామాంజనేయులు, ధనుంజయ, వెంకట్రాముడు, బాషా, దుర్గాప్రసాద్, గోవిందు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

అనంతపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల్లో రాజకీయ జోక్యం తగదు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని చేతివృత్తి దారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి హరికృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేతివృత్తి దారుల సమాఖ్య నాయకులు నాగప్ప, నాగభూషణ, రఘు, రామాంజనేయులు పాల్గొన్నారు.

శరణమా.. రణమేనా?

జెలెన్‌స్కీకి ట్రంప్ అల్టిమేటం

- మాతో ఒప్పందానికి రావాల్సిందే
- లేదంటే పూర్తిగా తప్పుకుంటాం
- మీకు మరో అవకాశమే లేదు
- ప్రపంచయుద్ధం వైపు నెడుతున్నారు
- రష్యాతో రాజీకి రావాల్సిందే
- జెలెన్‌స్కీకి అధ్యక్షుని స్పష్టీకరణ
- ఉద్రిక్తంగా సాగిన అధ్యక్షుల భేటీ
- మీడియా ముందే అరుపులు
- అధ్యక్ష స్థాయి భేటీలో ఎన్నడూ కనీవినీ ఎరగని దృశ్యాలు
- సంయుక్త మీడియా భేటీ రద్దు
- వైట్‌హౌస్ వీడి వెళ్లిపోవచ్చు
- జెలెన్‌స్కీని ఉద్దేశించి ట్రంప్

వాషింగ్టన్: ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ, అటు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్. దేశాధినేతలం అన్న విషయం కూడా మర్చిపోయి మీడియా సాక్షిగా వాగ్వాదానికి దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. ఒకరినొకరు దుయ్యబట్టుకున్నారు. అచ్చం వీధి బాగోతాన్ని తలపించేలా పాత విషయాలన్నీ తిర


శుక్రవారం ఓవల్ ఆఫీసు భేటీలో జెలెన్‌స్కీకి వేలు చూపిస్తూ ఆగ్రహంతో మాట్లాడుతున్న ట్రంప్

గదోడుతూ, పరస్పరం దెప్పిపొడుచుకుంటూ రెచ్చిపోయారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నడూ కనీ వినీ ఎరగని ఈ దృశ్యాలకు వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసు వేదికైంది. ఉక్రెయిన్‌లోని అపార ఖనిజ నిక్షేపాల్లో అమెరికాకు 50 శాతం వాటా ఇవ్వాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేయడం, బదులుగా రష్యా నుంచి తమ దేశానికి కచ్చితమైన రక్షణ హామీలు కావాలని జెలెన్‌స్కీ కోరడం తెలిసిందే. వాటిపై స్పష్టమైన ఒప్పందాల నిమిత్తం అగ్రరాజ్యం చేరిన ఆయన శుక్రవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో 45 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు పాల్గొన్న ఈ భేటీకి మీడియాను అనుమతించడమే గాక ప్రత్యక్ష ప్రసారం కూడా చేయడం విశేషం. భేటీ చాలాసేపటిదాకా ప్రశాంతంగానే సాగినా చివర్లో పూర్తిగా అదుపు తప్పింది. నేతలిద్దరి మాటల యుద్ధంతో రచ్చ రచ్చగా మారింది. చివరికి ఎటూ తేలకుండానే ముగిసింది. భేటీ అనంతరం జరగాల్సిన ట్రంప్, జెలెన్‌స్కీ సంయుక్త మీడియా భేటీ కూడా రద్దయింది! అంతేగాక, 'జెలెన్‌స్కీ వైట్‌హౌస్ వీడి వెళ్లిపోవచ్చు' అంటూ మీడియా సమక్షంలో ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందానికి సిద్ధపడితేనే తిరిగి తమతో చర్చలకు రావాలని సూచించారు. దాంతో ఎన్నో ఆశల నడుమ జెలెన్‌స్కీ చేపట్టిన అమెరికా యాత్ర ఆశించిన ఫలితం రాబట్టకపోగా వికటించినట్టు కనిపిస్తోంది.

అలా మొదలైంది...

రష్యా–ఉక్రెయిన్ వివాదం విషయమై దశాబ్ద కాలంగా అమెరికా వ్యవహరిస్తున్న తీరును ఆక్షేపిస్తున్నట్టుగా జెలెన్‌స్కీ మాట్లాడటంతో పరిస్థితి వేడెక్కింది. అమెరికా మీడియా అంతా చూస్తుండగా అంత అమర్యాదకరంగా మాట్లాడటం సరికాదంటూ వాన్స్ జోక్యం చేసుకున్నా ఆయన వెనక్కు తగ్గలేదు. తమతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నింటినీ రష్యా 2014 నుంచీ తుంగలో తొక్కుతూ వస్తున్నా అమెరికా సరైన రీతిలో జోక్యం చేసుకోలేదంటూ ఆక్షేపించారు. అధ్యక్షులు బరాక్ ఒబామా, ట్రంప్, బైడెన్ ఎవరూ తమకు చేయాల్సినంతగా సాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఖనిజ ఒప్పందానికి ప్రతిగా ఉక్రెయిన్ రక్షణకు అమెరికా స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ క్రమంలో, ''యుద్ధంలో అంతులేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తే ఎలా ఉంటుందో అమెరికాకు తెలియదు. బహుశా మున్ముందు తెలిసొస్తుందేమో!'' అన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత అదుపు తప్పింది. ట్రంప్ ఒక్కసారిగా తీవ్ర అసహనానికి లోనయ్యారు. జెలెన్‌స్కీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ''అలాంటి పరిస్థితి మాకెప్పుడూ రాదు. ఎప్పటికీ తిరుగులేని శక్తిగానే ఉంటాం'' అంటూ ఆగ్రహంగా బదులిచ్చారు. ''ఉక్రెయిన్‌కు ఇన్నేళ్లుగా అన్నివిధాలా ఆదుకుంటూ వస్తున్నాం. ఈ యుద్ధంలో ఇప్పటికే 350 బిలియన్ డాలర్ల మేర సాయుధ, ఆర్థిక సాయం అందించాం. లేదంటే రష్యాతో యుద్ధం కొనసాగించడం మీ తరమయ్యేదే కాదు. పోరు రెండే వారాల్లో ముగిసిపోయేది'' అంటూ దుయ్యబట్టారు. అయినా జెలెన్‌స్కీకి మాత్రం కనీస కృతజ్ఞత కూడా లేదంటూ విరుచుకుపడ్డారు. మీడియా ముందే తనతో గొడవకు దిగుతూ అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నారంటూ విమర్శించారు. ''అమెరికా దన్ను లేనిదే మీరెందుకూ కొరగారు! మాకు షరతులు విధించే, మమ్మల్ని డిమాండ్ చేసే పరిస్థితిలో అసలే లేరు. అది గుర్తుంచుకోండి'' అంటూ వేలు చూపిస్తూ మరీ జెలెన్‌స్కీని కటువుగా హెచ్చరించారు. ''మీరు లక్షలాది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. మూడో ప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెట్టేలా ప్రమాదకర జూదం ఆడుతున్నారు'' అంటూ జెలెన్‌స్కీని ఆక్షేపించారు. మధ్యలో పదేపదే ఆయన భుజంపై కొట్టి మరీ ఆగ్రహం వెలిగక్కారు. రష్యాతో ఏ విషయంలోనూ రాజీ పడేదే లేదన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలను కూడా ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ''పుతిన్ ఒక ఉగ్రవాది. యుద్ధాల్లోనూ నిబంధనలుంటాయి. వాటన్నింటినీ కాలరాసిన పుతిన్ వంటి హంతకునితో ఎలాంటి రాజీ ఉండబోదు'' అని జెలెన్‌స్కీ అన్నారు. అలా కుదరదని, యుద్ధానికి తెర దించాలంటే రష్యాతో చాలా విషయాల్లో రాజీ పడాల్సిందేనని ట్రంప్ కుండబద్దలు కొట్టారు. ''ఇలాగైతే మాతో వ్యాపారం కష్టమే. అమెరికాతో ఖనిజ వనరుల ఒప్పందానికి అంగీకరిస్తారా, సరేసరి. లేదంటే మీకూ మాకూ రాంరాం'' అంటూ తేల్చిపడేశారు. వాగ్వాదం పొడవునా నేతలిరువురూ పదేపదే వాగ్బాణాలు విసురుకున్నారు. కనీసం ఇప్పటికైనా అమెరికా చేస్తున్న దానికి కృతజ్ఞతలు చెప్పండంటూ వాన్స్ కల్పించుకోగా ట్రంప్ వారించారు. ''పర్లేదు. ఈ డ్రామా నాకూ సరదాగానే ఉంది. జరుగుతున్నదేమిటో అమెరికా ప్రజలందరూ చూడాలి'' అన్నారు.

సాయానికి హామీ ఇవ్వలేం: ట్రంప్

జెలెన్‌స్కీతో భేటీకి ముందు ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌తో సహజ వనరుల ఒప్పందంపై ఆయన, తాను కాసేపట్లో సంతకాలు చేస్తామని ప్రకటించారు. యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలన్నదే తన ఉద్దేశమన్నారు. అయితే, ''ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక సాయం కొనసాగుతుంది. కాకపోతే ఈ విషయంలో మానుంచి మరీ ఎక్కువగా ఆశించకూడదు'' అని స్పష్టం చేశారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కృతనిశ్చయంతో ఉన్నారంటూ మరోసారి ప్రశంసించారు.


గాయపడిన వారిని తరలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఉత్తరాఖండ్‌లో భారీ హిమపాతం
బీఆర్‌ఓ క్యాంపుపై విరిగిపడిన
మంచు చరియలు

32 మందిని రక్షించిన అధికారులు | మరో 25 మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో భారీ హిమపాతం బెంబేలెత్తిస్తోంది. మంచు చరియలు విరిగిపడుతున్నాయి. చమోలీ జిల్లాలో మనా–బద్రీనాథ్ మార్గంలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్‌ఓ) క్యాంపుపై శుక్రవారం ఉదయం హఠాత్తుగా మంచు చరియలు విరిగిపడ్డాయి. రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్ నుంచి 300 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్యాంపులోని 57 మంది కార్మికులు మంచు చరియల కింద చిక్కుకుపోగా, 32 మందిని రక్షించామని మరో 25 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ చెప్పారు. వీరంతా రోడ్లపై మంచును తొలగించేందుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడినవారిని మనా గ్రామంలోని ఐటీబీపీ క్యాంప్‌నకు తరలించి చికిత్స అందించారు. నలుగురు బాధితుల పరిస్థితి విషమంగా ఉంది. కార్మికుల్లో ఎక్కువ మంది జార్ఖండ్‌కు చెందినవారేనని సమాచారం. హిమపాతంతోపాటు భారీగా వర్షం కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. మంచు చరియలు మరోసారి విరిగిపడే అవకాశం ఉండడంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు. పరిస్థితి సానుకూలంగా మారిన తర్వాత మిగతా వారి కోసం గాలింపు ప్రారంభిస్తామని తెలిపారు. మనా గ్రామం బద్రీనాథ్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఇండియా–టిబెట్ సరిహద్దుకు అత్యంత సమీపంలో సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎగువన ఉంది. సరిహద్దులో ఇదే చిట్టచివరి గ్రామం. సాధారణంగా ఇక్కడి బీఆర్‌ఓ క్యాంపును ప్రతిఏటా చలికాలంలో బద్రీనాథ్‌కు తరలిస్తుంటారు. ఈసారి భారీ హిమపాతం వల్ల అది సాధ్యం కాలేదు. నర్, నారాయణ్ అనే రెండు పర్వతాల పాదాల చెంత బద్రీనాథ్ ధామ్ కొలువై ఉంది. ఈ రెండు పర్వతాల మధ్యనుంచి అలకనంద నది ప్రవహిస్తోంది. నర్ పర్వతం వద్ద తాజా ప్రమాదం జరిగింది.

ఉత్తరాఖండ్ ప్రమాదంపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. మంచు ఫలకాల కింద చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి అందుబాటులో ఉన్న వనరులతో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీతోపాటు ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం గురించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరా తీశారు. కార్మికులందరినీ రక్షించాలని, అవసరమైన సాయం అందిస్తామని చెప్పారు. సహాయక చర్యలను సీఎం పుష్కర్‌సింగ్ ధామీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కార్మికులంతా ప్రాణాలతో బయటపడాలని బద్రీవిశాల్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. చమోలీ, ఉత్తరకాశీ, రుద్రప్రయాగ, పితోర్‌గఢ్ జిల్లాల్లో సముద్ర మట్టానికి 2,400 మీటర్ల ఎగువన ఉన్న ప్రాంతాల్లో భారీగా హిమపాతం కురవడంతోపాటు మంచు చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని డిఫెన్స్ జియోఇన్ఫర్మాటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీజీఆర్‌ఈ) గురువారం సాయంత్రం హెచ్చరికలు జారీ చేసింది.


కార్మికులను బయటికి తీసుకొచ్చే ప్రయత్నంలో సైనికులు


ఒక కార్మికున్ని సురక్షితంగా బయటికి తీసుకొస్తున్న సిబ్బంది

పాకిస్తాన్‌లో మత సదస్సులో
ఆత్మాహుతి దాడి

మత పెద్ద సహా ఐదుగురి మృతి..
20 మందికి గాయాలు

పెషావర్: వాయవ్య పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూంక్వా ప్రావిన్స్‌లో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభానికి ముందు ఘోరం జరిగింది. నౌషెరా జిల్లా అకోరా ఖట్టక్ పట్టణంలో మతపరమైన సదస్సులో ఆత్మాహుతి దాడి చోటుచేసుకోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది గాయపడ్డారు. శుక్రవారం సదస్సులో జుమ్మా ప్రార్థనలు జరుగుతుండగా ఓ దుండగుడు తనను తాను పేల్చేసుకున్నాడు. ఈ ఘటనలో జమీయత్ ఉలేమా ఇస్లామ్ (జేయూఐ) అధినేత, మదర్సా–ఇ–హక్కానియా మసీదు నిర్వాహకుడు హమీదుల్ హక్ హక్కానీతోపాటు మరో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. హక్కానీ లక్ష్యంగానే ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నామని స్థానిక ఐజీ జుల్ఫికర్ హమీద్ చెప్పారు. 1968లో జన్మించిన హక్కానీ తన తండ్రి మౌలానా సమీ ఉల్ హక్ మరణం తర్వాత జేయూఐ అధినేతగా బాధ్యతలు చేపట్టారు. మతపెద్దగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రాణాపాయం ఉండడంతో పోలీసులు ఆయనకు ఆరుగురు సెక్యూరిటీ గార్డులతో రక్షణ కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఆత్మాహుతి దాడిలో హక్కానీ మరణించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఆత్మాహుతి దాడికి ఎవరు కారకులన్నది ఇంకా తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

బీజేపీ దళిత వ్యతిరేకి

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో
ఖాళీలను భర్తీ చేయాలి: రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండడం పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దళితుల హక్కులు, ప్రయోజనాలను కాపాడే బాధ్యత కలిగిన కమిషన్‌లో ఖాళీలను భర్తీ చేయకపోవడం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు కీలక పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగా ఉంటున్నప్పటికీ పట్టించుకోవడం లేదంటే అధికార బీజేపీ దళిత వ్యతిరేక వైఖరిని అర్థం చేసుకోవచ్చని అన్నారు. దళితుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ రాజ్యాంగబద్ధమైన సంస్థ అని గుర్తుచేశారు. కమిషన్‌ను ఉద్దేశపూర్వకంగా బలహీనపర్చడం రాజ్యాంగంపై, దళితుల సామాజిక హక్కులపై ప్రత్యక్షంగా దాడి చేయడమే అవుతుందని తేల్చిచెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇకనైనా మేల్కొనాలని, కమిషన్‌లో ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ అచేతనంగా మిగిలిపోతే దళితులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని రాహుల్ ఆవేదన వ్యక్తంచేశారు. వారి ఫిర్యాదులపై ఎవరు స్పందించారని ప్రశ్నించారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌లో ప్రస్తుతం చైర్మన్, ఒక మెంబర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి.

పట్టాలెక్కనున్న ఎఫ్‌టీయే

ఈ ఏడాది ఆఖరు నాటికి ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే
ప్రధాని మోదీ, ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ నిర్ణయం

వాండర్ లెయెన్‌తో ప్రధాని మోదీ చర్చలు


న్యూఢిల్లీ: భారత్–యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య చాలాఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీయే) త్వరలో పట్టాలకెక్కే దిశగా అడుగు ముందుకు పడింది. చరిత్రాత్మకంగా భావిస్తున్న ఈ ఒప్పందాన్ని ఈ ఏడాది ఆఖరు నాటికి కుదుర్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ నిర్ణయించారు. ఈ మేరకు ఒక డెడ్‌లైన్ విధించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై సుంకాలు విధిస్తుండడంతో వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలకు నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో భారత్, ఈయూ దేశాలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా కుదుర్చుకోవాలని మోదీ, ఉర్సులా ఒక అంగీకారానికి వచ్చారు. వారిద్దరూ శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. నిజానికి ఇండియా, ఈయూ మధ్య ఈ ఒప్పందం కోసం గత 17 ఏళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇరుపక్షాల మధ్య జరుగుతున్న సంప్రదింపులు ఒక కొలిక్కి రావడం లేదు. 2013లో సంప్రదింపులు నిలిచిపోయాయి. 2022 జూన్‌లో పునఃప్రారంభమయ్యాయి. కానీ, ఆశించిన విధంగా ముందుకు సాగడం లేదు. కొన్ని అంశాలపై ఈయూ గట్టిగా పట్టుబడుతుండగా, ఇండియా సమ్మతించడం లేదు. కార్లు, వైన్, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు రద్దు చేయాలని ఈయూ కోరుతుండగా, భారత ప్రభుత్వం తిరస్కరిస్తోంది. మోదీ, ఉర్సులా భేటీ కావడంతో ఇక ప్రతిష్టంభన తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

కలసికట్టుగా పనిచేద్దాం

భారత్, ఈయూ మధ్య సంబంధాలపై మోదీ, ఉర్సులా విస్తృతంగా చర్చించారు. ఇరుపక్షాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ప్రధానంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకొనేలా కలసికట్టుగా పనిచేయాలని తీర్మానించారు. ఇండియాతో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్నదే తమ ఉద్దేశమని ఉర్సులా పేర్కొన్నారు. ఇండియా–ఈయూ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఒక కచ్చితమైన రోడ్‌మ్యాప్ రూపొందించుకోవాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. తదుపరి ఇండియా–ఈయూ శిఖరాగ్ర సదస్సు నాటికి రోడ్‌మ్యాప్ సిద్ధమవుతుందని అన్నారు. ఈ సదస్సు వచ్చే ఏడాది భారత్‌లో జరుగనుంది. మరోవైపు భేటీ తర్వాత మోదీ, ఉర్సులా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. భారత్, ఈయూ మధ్య వ్యాపారం వాణిజ్యం, టెక్నాలజీ, పెట్టుబడులు, నవీన ఆవిష్కరణలు, గ్రీన్ ఎనర్జీ, భద్రత, నైపుణ్యాభివృద్ధి, రవాణా వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని, ఇరుపక్షాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా ఒక ప్రణాళిక సిద్ధం చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్ లార్డ్ క్వింటెరో అమెరికాకు తరలింపు

- మరో 28 మంది నేరగాళ్లు సైతం
- ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు దిగొచ్చిన మెక్సికో


రఫేల్ కారో క్వింటెరో

మెక్సికో సిటీ: డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపాలన్న ట్రంప్ యంత్రాంగం ఒత్తిళ్లు మెక్సికో ప్రభుత్వంపై పనిచేశాయి. యూఎస్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ(డీఈఏ) అధికారి హత్య కేసులో ఆరోపణలున్న కరడుగట్టిన డ్రగ్స్ ముఠా నాయకుడు రఫేల్ కారో క్వింటెరో సహా 29 మంది మాఫియా ముఖ్యులను మెక్సికో ప్రభుత్వం అమెరికాకు అప్పగించింది. మాదక ద్రవ్యాల మాఫియా ముఖ్యులను తమకు అప్పగించకుంటే మంగళవారం నుంచి అన్నిరకాల మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాలను విధించక తప్పదన్న ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలతో మెక్సికో ప్రభుత్వ యంత్రాంగం మునుపెన్నడూ లేని విధంగా సహకరించేందుకు ముందుకు రావడం గమనార్హం. మెక్సికోలోని వేర్వేరు జైళ్లలో ఉన్న డ్రగ్ మాఫియా పెద్దతలలను గురువారం రాజధాని మెక్సికో సిటీలో విమానాలకు ఎక్కించారు. మొత్తం 29 మందిని అమెరికా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది నగరాల్లోని జైళ్లకు తరలించారు. వీరిలో అమెరికా ప్రభుత్వం ఇటీవల విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించిన ఆరు గ్రూపులకుగాను ఐదు గ్రూపులకు చెందిన వారున్నారు. కారో క్వింటెరోతోపాటు సినలోలా కార్టెల్‌లోని రెండు గ్రూపులకు చెందిన ముఖ్యులు, 2022లో నార్త్ కరోలినాలో పోలీసు అధికారి హత్య కేసులో నిందితుడొకరు ఇందులో ఉన్నారని మెక్సికో అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, హత్య తదితర నేరారోపణల కింద వీరిపై విచారణ జరపనున్నామని అమెరికా అటార్నీ జనరల్ పమేలా బోండి చెప్పారు. మెక్సికో విదేశీ వ్యవహారాల కార్యదర్శి జువాన్, ఇతర ఉన్నతాధికారులు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తదితరులతో సమావేశమైన సమయంలోనే ఈ అప్పగింతలు చోటుచేసుకోవడం విశేషం. డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపడం, అక్రమ వలసదారులను నిలువరించడం, ప్రమాదకరమైన డ్రగ్ ఫెంటానిల్ ఉత్పత్తిని నిలిపివేయడం వంటివి మానుకో కుంటే టారిఫ్‌లు తప్పవని, సానుకూలంగా స్పందించిన పక్షంలో టారిఫ్‌ల అమలును వాయిదా వేస్తామని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేశారు. దీంతో, ఇటీవలి కాలంలో వలసలు, ఫెంటానిల్ ఉత్పత్తిలో తగ్గుదల నమోదైంది. కాగా, మెక్సికో డ్రగ్స్ హంతక ముఠాలను అప్పగించే విషయంలో ఇంత సానుకూలంగా స్పందించడాన్ని చారిత్రక ఘటనగా డీఈఏ మాజీ చీఫ్ మైక్ విజిల్ అభివర్ణించడం గమనార్హం.

విద్యార్థుల మరణాలు దురదృష్టకరం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీలు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంల)లో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇటువంటి ఘటనల నివారణకు బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పింది. ఐఐటీలు, ఐఐఎంల్లో గడిచిన 14 నెలల్లో 18 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు సీనియర్ లాయర్ ఇందిరా జైసింగ్ తెలపడంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పైవిధంగా వ్యాఖ్యానించింది. ఈ అంశానికి న్యాయపరమైన ముగింపు ఇస్తామని పేర్కొంది. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల 2017లో, మహారాష్ట్రలోని టీఎన్ టోపీవాలా మెడికల్ కాలేజీ విద్యార్థిని పాయల్ తాడ్వి 2019లో బలవన్మరణం చెందారు. తమ విద్యాసంస్థల్లో కులపరమైన వివక్షను భరించలేకే ప్రాణాలు తీసుకున్నారంటూ వీరి తల్లులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇటువంటి ఘటనల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, కోర్టు ఆదేశాలున్నా విద్యార్థుల ఆత్మహత్యల ఘటనల వివరాలను ఇచ్చేందుకు విద్యాసంస్థలు ససేమిరా అంటున్నాయని లాయర్ జైసింగ్ శుక్రవారం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

ముంబై తీరంలో మత్స్యకారుల పడవకు మంటలు

18 మంది జాలర్లను కాపాడిన పోలీసులు

ముంబై: మత్స్యకారుల పడవకు మంటలు అంటుకోవడంతో వెంటనే రంగంలోకి దిగిన తీర రక్షక దళం(ఐసీ జీ), పోలీసులు కలిసి 18 మందిని కాపాడారు. శుక్రవారం వేకువజామున మహారాష్ట్రలోని రాయిగఢ్ జిల్లా అలీబాగ్‌కు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అలీ బాగ్‌లోని అక్షి తీరానికి ఏడు నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా రాకేశ్ గన్ అనే వ్యక్తికి చెందిన ట్రాలర్ బోట్‌కు ఉదయం 4 గంటల సమయంలో మంటలు అంటుకున్నాయి. జాలర్లు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు నేవీ, ఐసీజీతో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ట్రాలర్‌లోని 18 మంది జాలర్లను రక్షించి, తీరానికి సురక్షితంగా చేర్చారు. ఇంజిన్ నుంచి లీకైన ఆయిల్ సైలెన్సర్‌లోకి చేరడంతో మంటలు చెలరేగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సాఖర్ గ్రామానికి చెందిన రాకేశ్ గన్, అతడి ఇద్దరు సోదరులు గత 14 రోజులుగా చేపల వేట కోసం సముద్రంలోనే ఉన్నట్లు తెలిపారు. గ్రామానికి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మంటల్లో కాలిన గాయాలైన 14 మందిని ఆస్పత్రిలో చేర్చామన్నారు.


మంటలను ఆర్పుతున్న ఐసీజీ సిబ్బంది

124 ఏళ్లలో కెల్లా అత్యంత వేడి ఫిబ్రవరి

ఈసారి ఎండలు అప్పుడే దంచికొడుతున్నాయి. ఎండాకాలం ఇంకా మొదలైనా కాకుండానే ఠారెత్తిస్తున్నాయి. ఆ క్రమంలో గత 124 ఏళ్లలో అత్యంత వేడిమి ఫిబ్రవరిగా గత మాసం కొత్త రికార్డు సృష్టించింది. గత నెలలో సగటున 22 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. 1901 తర్వాత ఫిబ్రవరిలో ఈ స్థాయి సగటు నమోదవడం ఇదే తొలిసారి. అంతేకాదు, చరిత్రలోనే తొలిసారిగా ఈ ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు ఏకంగా 15 డిగ్రీల పై చిలుకు నమోదై సరికొత్త రికార్డు నెలకొల్పాయి. అంతేగాక సగటు గరిష్ట ఉష్ణోగ్రత విషయంలో 2023 ఫిబ్రవరి నెలకొల్పిన రికార్డును కూడా గత నెల దాదాపుగా అధిగమించినంత పని చేసింది! దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ మార్పుల తాలూకు విపరిణామాలకు ఈ ఉష్ణ ధోరణులు తాజా నిదర్శనమని వారు చెబుతున్నారు. ''సాధారణంగా ఎల్ నినో, లేదంటే లా నినా వంటి పరిస్థితులున్నప్పుడు ఉష్ణోగ్రతల్లో తీవ్రస్థాయిలో హెచ్చుతగ్గులు పరిపాటే. కానీ కొద్ది నెలలుగా అతి బలహీన లా నినా పరిస్థితి నెలకొని ఉంది. అది ఉష్ణోగ్రతలను ప్రభావితం చేయగల స్థాయిలో లేదు. అయినా ఫిబ్రవరిలో ఎండలు మండిపోవడం మంచి పరిణామమైతే కాదు'' అని సైంటిస్టులు చెబుతున్నారు. గత 20 ఏళ్ల వరుసగా చరిత్రలోనే అత్యంత వేడిమి దశాబ్దాలుగా రికార్డులు సృష్టించిన వైనాన్ని వారు గుర్తు చేస్తున్నారు. అకస్మాత్తుగా వరుణుడు కరుణిస్తే తప్ప వచ్చే మూడు నెలలు ప్రచండమైన ఎండలు తప్పవని జోస్యం చెబుతున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

అధికార భాష ఆంగ్లం

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయనున్న ట్రంప్

వాషింగ్టన్: అగ్రరాజ్యంలో మెజార్టీ ప్రజలు మాట్లాడే భాష ఆంగ్లం. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవహారాల్లో ఉపయోగించే భాష ఆంగ్లమే. దేశంలో ఇతర భాషలు సైతం మాట్లాడేవాళ్లు కూడా ఉన్నారు. అమెరికా చరిత్రలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఏ భాషకూ అధికార భాష హోదా లేదు. ఇంగ్లిష్‌కు ఇప్పుడు ఆ హోదా కల్పించాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకల్పించారు. ఇంగ్లిష్‌ను దేశమంతటా అధికార భాషగా గుర్తిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేయబోతున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలియజేశాయి. అయితే, ఎప్పుడు సంతకం చేస్తారన్నది బయటపెట్టలేదు. అమెరికాలో కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఆంగ్లాన్ని అధికార భాషగా గుర్తించాయి.

• సమాజానికి ఉక్కు కవచం

ఆ 'సగమే' అసలు బలం



శరీరంలో ఐరన్ లేమి స్త్రీలను బాధిస్తూ ఉంటుంది. గర్భధారణ, ప్రసవ సమయాలలో ఎంతో కీలకమైన ఐరన్ కోసం స్త్రీలు ఆహారం, మందుల మీద ఆధారపడుతుంటారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' అంచనా ప్రకారం నేడు ప్రపంచ వ్యాప్తంగా 15 నుంచి 49 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీలు 50 కోట్ల మంది ఐరన్ డెఫిషియెన్సీతో బాధ పడుతున్నారు.

కాని వీరు తమ స్వభావంలో ఉక్కుగుణాన్ని మాత్రం ఎన్నడూ వదులుకోరు. వీరు మాత్రమే కాదు ప్రతి స్త్రీ తన జీవనంలో, పరిస్థితులను ఎదుర్కొనడంలో ఉక్కు మహిళే. ఆ మహిళ తెలుగు నాట మారుమూల పల్లెలో ఉండొచ్చు. ప్రపంచంలో వేరే మూలన మరో గూడెంలో ఉండొచ్చు. మహిళా దినోత్సవం 'స్థానికం'గా నిర్వహించే తంతు కాదు. ఇది అంతర్జాతీయ వేడుక. ప్రపంచ మహిళలను ఏకం కావాలని కోరే సందేశ సందర్భం.

1910లో కోపెన్‌హెగెన్‌లో 17 దేశాల నుంచి వచ్చిన 99 మంది మహిళలు 'శ్రామిక మహిళల హక్కుల దినోత్సవం' కోసం పిలుపు ఇచ్చినప్పుడు అది అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావాలనే కోరుకున్నారు. కారణం భూమ్మీద ఏ మూలన ఉన్న స్త్రీ అయినా స్థూలంగా ఎదుర్కొనే సమస్యలు ఒకటేనని భావించడం. అందరూ కలిసి సమస్యల పై పోరాడాలని కోరుకోవడం.

ఇన్నేళ్లు గడిచినా రూపంలో, సారంలో స్త్రీలు అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. యుద్ధాలు వస్తే వారు తమ ఇంటిని, భర్తను, సంతానాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో చేసే తవ్వకాలు, కట్టే పెను కట్టడాలు, ప్రకటించే సుందరీకరణాలు మొదటగా స్త్రీలు శ్రమపడి అల్లిన గూళ్లనే ధ్వంసం చేస్తున్నాయి. చట్టపరమైన అనుమతి కలిగిన వ్యసనాలు... మద్యపానం, ధూమపానం పురుషుల ఆరోగ్యాన్ని దెబ్బ తీసి స్త్రీల మీద పెను ఒత్తిడి పెడుతున్నాయి.

తాజాగా ఆన్‌లైన్ ట్రేడింగ్ అడిక్షన్ లక్షల కొద్ది అప్పును కుటుంబం మీద కుమ్మరించేలా చేస్తోంది. కడుపున పుట్టిన సంతానం పాలిట డ్రగ్స్, గంజాయి పెను పడగలు విప్పి ఉన్నాయి. స్త్రీ తన చేతులతో ఒండి పెట్టాల్సిన ఆహారం కలుషితాలను కలిగి బతుక్కు ఏమాత్రం గ్యారంటీ ఇవ్వలేకపోతోంది. నిత్యావసర ఖర్చులను స్త్రీయే అజమాయిషీ చేసి ఎంత పొదుపు చేయాలనుకున్నా అనారోగ్య ఖర్చు, చదువు ఖర్చు స్త్రీల ప్రధాన కార్యక్షేత్రమైన 'ఇంటిని' పూర్తిగా సంక్షోభంలో పడేస్తున్నాయి.

దేశం సరిహద్దులోని సైన్యం, కేంద్ర, రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగం వల్ల మాత్రమే నడుస్తోంది అనుకుంటే పొరపాటు. వీటన్నింటి మధ్య ఉక్కుగుణాన్ని వదుల్చుకోని స్త్రీలే దేశాన్ని నడుపుతున్నారు.

అయినప్పటికీ వీరి స్థయిర్యాన్ని దెబ్బ తీయడానికి తగిన పీడనలను ఈ సమాజం వదులుతూనే ఉంది. లైంగిక వేధింపులు, సామూహిక అత్యాచారాలు, యాసిడ్ దాడులు, ప్రేమకు 'నో' చెప్తే హత్యలు, ఉద్యోగ ఉపాధి రంగాల్లో జీతభత్యాల వివక్ష, చట్ట సభల్లో ఇంకా దొరకని వాటా, గృహ హింస, వరకట్నం, తీరికే ఇవ్వని ఇంటి చాకిరి, పిల్లల పెంపకం, ఆడపిల్ల జననానికి అననుకూలత... ఇవన్నీ ప్రపంచవ్యాప్త స్త్రీలతో పాటు భారతీయ మహిళలకు మూగదెబ్బలుగా మారుతున్నాయి.

నిజానికి ఇప్పుడు వారి బాధ్యత ఇంకా పెరిగింది. స్త్రీలు ముందుకు వస్తే తప్ప సరికాని సమస్యలు పెరుగుతున్నాయి. పురుషులు తెస్తున్న దేశాల మధ్య యుద్ధం, పర్యావరణ విధ్వంసం, పౌర హక్కుల విఘాతం, న్యాయ వివక్ష, మత విద్వేషం, తప్పుడు వాట్సప్ సమాచారాల పంపిణీ, బలహీనులపై బెదిరింపు... ఇవన్నీ మొదట ఎవరో మనకు తెలియని స్త్రీ ఇంటికే హాని కలిగించవచ్చుగాని కాలక్రమంలో అవి ప్రతి ఇంటికీ చేరుతాయి.

స్త్రీలు తాము నివసించే ఇంటి లోపలి, బయటి ఆవరణాలను ప్రజాస్వామ్య స్వభావంతో ఉంచడానికి... సుహృద్భావన పెంచడానికి... పిల్లలకు అందరూ కలిసి ఆడే ఆటస్థలాలు ఇవ్వడానికి... సంపద కాస్తయినా దిగువ వర్గాలకు అందేలా చూడటానికి... విద్య, వైద్యంలో అతి డబ్బు ప్రమేయాన్ని నిరోధించడానికి.... ఆచార వ్యవహారాలు గుదిబండలుగా మారకుండా, రాజ్యాంగస్ఫూర్తిని రక్షించుకోవడానికి మరింత ఆలోచన, చైతన్యం కలిగించుకోవాలి. మరింత ఉక్కుగుణం సముపార్జించుకోవాలి.

ప్రతి స్త్రీకి తను, తన కుటుంబం, తన సమాజం, తన దేశం, తన ప్రపంచం... ఇవన్నీ ముఖ్యం. దుర్మార్గం అనేది కేవలం ఇతరుల పాలిట జరిగితే ఊరుకోగలిగేది కాదు. దుర్మార్గం అందరూ ఖండించదగ్గది. పురుష సమాజం తన దుర్మార్గాలకు అడ్డెవరు నిలుస్తారులే అనుకుంటే జవాబు స్త్రీల నుంచే వస్తుంది.

స్త్రీలకు ఇంటిని చక్కదిద్దుకోవడమే కాదు... పరిస్థితులను చక్కదిద్దడం కూడా తెలుసు.

ఉక్కు మహిళలకు స్వాగతం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నేటి నుంచి సాక్షి ఫ్యామిలీలో వారం రోజుల పాటు విశిష్ట కథనాలను అందించనున్నాం.

'సమ' దారిలో 'సగం' దూరం

లక్ష్యం కూడా విత్తనంలాంటిదే. విత్తే ముందు దాని విలువ అంతగా తెలియకపోవచ్చు. 'అది ఎప్పుడు మొలకెత్తాలి? ఎప్పుడు చెట్టు కావాలి?' అనే నిరాశ కూడా ఎదురు కావచ్చు. అయితే విత్తనం ఎప్పుడూ ఫలాన్ని వాగ్దానం చేస్తుంది. విత్తనంలాగే లక్ష్యం కూడా ఫలితాన్ని వాగ్దానం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 'విమెన్స్ ఈక్వాలిటీ 2030' లక్ష్యం ఎంతో ఆశను రేకెత్తించడంతో పాటు ఎప్పటికప్పుడూ చర్చనీయాంశంగా ఉంటూ వస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే ముందు సవాళ్లు, సమస్యలపై అవగాహన ఉండాలి. విమెన్ అండ్ యూనైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్ రిపోర్ట్ జెండర్ ఈక్వాలిటీకి ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించింది.



నాయకత్వంలో మహిళల కొరత

పార్లమెంటరీ సీట్లలో 27 శాతం, స్థానిక సీట్లలో 36 శాతం, మేనేజ్‌మెంట్ పదవుల్లో 28 శాతం మహిళలు మాత్రమే ఉండడంతో సమగ్ర విధాన రూపకల్పనకు ఆటంకం కలుగుతోంది. భిన్న అభిప్రాయాల కొరత కనిపిస్తోంది.

పేదరికం

2030 నాటికి 34 కోట్ల మంది మహిళలు, బాలికలు తీవ్ర పేదరికంలో మగ్గిపోతారని అంచనా. ప్రపంచ మహిళా జనాభాలో 8 శాతం మంది రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ సంపాదనతో జీవిస్తున్నారు.

పని ప్రాంతంలో వివక్ష-అసమానతలు

పురుషులలో 91 శాతం మందితో పోల్చితే మహిళల్లో 61 శాతం మంది మాత్రమే శ్రామిక శక్తి (లేబర్ ఫోర్స్)లో ఉన్నారు. ఇది ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి రెండిటినీ ప్రభావితం చేస్తుంది. పురుషులతో పోలిస్తే శ్రమ ద్వారా మహిళలు తక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు.

అసమతుల్యత

పనిచేసే వయసులో ఉన్న సుమారు 2.4 బిలియన్‌ల మహిళలకు సమాన ఆర్థిక అవకాశాలు లభించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.4 బిలియన్‌ల మహిళలకు పురుషులతో సమానమైన ఆర్థిక హక్కులు లేవు.

వేతనం లేని సంరక్షణ(అన్‌పేయిడ్ కేర్ వర్క్)లో మహిళలు, పురుషులు గడిపే సమయం మధ్య అంతరం కొద్దిగా తగ్గుతుంది. కానీ 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా మహిళలు పురుషుల కంటే 9.5 శాతం ఎక్కువ సమయం(రోజుకు 2.3 గంటలు) వేతనం లేని సంరక్షణ పనిలో గడుపుతారు. ఈ నిరంతర అంతరం విద్య, ఉపాధి, ఇతర అవకాశాలలో మహిళల భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తుంది.

సామాజిక కట్టుబాట్లు - సాంస్కృతిక ఆచారాలు

ప్రపంచవ్యాప్తంగా ప్రతి అయిదుగురు యువతులలో ఒకరికి పద్దెనిమిది ఏళ్లు నిండక ముందే పెళ్లి జరుగుతుంది.

విద్య-ఆరోగ్యం

2030 నాటికి 110 మిలియన్‌ల మంది బాలికలు, యువతులు స్కూల్‌కు దూరంగా ఉంటారని అంచనా.

ఆహార అభద్రత

2030 నాటికి దాదాపు 24 శాతం మంది మహిళలు, బాలికలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కోనున్నారని అంచనా.

హింస

ప్రతి సంవత్సరం 245 మిలియన్‌ల మంది మహిళలు, బాలికలు భర్త, సన్నిహితుల ద్వారా శారీరక, లైంగిక హింసకు గురవుతున్నారు. వృద్ధ పురుషులతో పోల్చితే వృద్ధ మహిళలు ఎదుర్కొంటున్న పేదరికం, హింస ఎక్కువ.

నిధుల కొరత

లింగ సమానత్వం గురించి అవగాహన కలిగించే కార్యక్రమాల నిర్వహణకు తగినంత నిధులు లేవు. కేవలం నాలుగు శాతం మాత్రమే లింగ సమానత్వం, మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలపై కేటాయిస్తున్నారు. 2030 నాటికి లింగ సమానత్వాన్ని సాధించడానికి అవసరమైన అదనపు పెట్టుబడి సంవత్సరానికి 360 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

అమలు చేయని చట్టాలు

కనీసం 28 దేశాలలో వివాహం, విడాకులకు సంబంధించి మహిళలకు సమాన హక్కులు కల్పించే చట్టాలు లేవు. 67 దేశాలలో మహిళలపై ప్రత్యక్ష, పరోక్ష వివక్షను నిషేధించే చట్టాలు లేవు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి చట్టాలు ఉన్న చోట సమర్థవంతమైన అమలు సవాలుగా ఉంది.

.......'సవాళ్లు, సమస్యల సంగతి సరే, ఇప్పటి వరకు మనం ఏర్పర్చుకున్న లక్ష్యాల వల్ల ఏ మేరకు పురోగతి సాధించాం?' అనే ప్రశ్న వేసుకుంటే జవాబు కొంత ఆశాజనకంగా ఉంటుంది. అంతర్జాతీయ నియమాల (ఇంటర్నేషనల్ కమిట్‌మెంట్స్) వల్ల కొన్ని రంగాలలో మెరుగుదల కనిపిస్తుంది. బాల్య వివాహాలు కొంత మేరకు తగ్గిపోయాయి. ఇది చిన్న ఆశా రేఖ మాత్రమే.

'కోవిడ్‌లాంటి విపత్తుల వల్ల 2030 లక్ష్యం మనుపటి కంటే మరింత దూరంలో ఉంది' అనే మాట వినబడుతుంది.

2030 లక్ష్యాలకు సంబంధించి చాలా రంగాల్లో పురోగతి మందకొడిగా సాగుతుందని, బాల్యవివాహాలు పూర్తిగా కనిపించకుండా చేయడానికి, చట్టపరమైన రక్షణ (లీగల్ ప్రొటెక్షన్)లో అంతరాలను పూడ్చడానికి, వివక్ష పూరిత చట్టాలను తొలగించడానికి, పని ప్రాంతంలో అధికారం, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడానికి, పార్లమెంట్‌లో సమాన ప్రాతినిధ్యం సాధించడానికి పట్టే కాలం... సుదీర్ఘ కాలం అంటున్నారు.

'2030 లక్ష్యాలను చేరుకోవడానికి సమిష్టి కృషి, నిధుల పెంపుదల అవసరం. ఈ ప్రయాణంలో ప్రతి అడుగు కీలకమైనదే' అంటుంది యూఎన్ రిపోర్ట్.

జెండర్ ఈక్వాలిటీ స్ట్రాటజీ 2022-2025

'జెండర్ ఈక్వాలిటీ స్ట్రాటజీ 2022-2025' పేరుతో ఐక్యరాజ్యసమితి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ది గ్లోబల్ కాంటెక్స్ట్-క్రైసిస్ అండ్ ఆపర్చునిటీ, వాట్ వుయ్ హ్యావ్ లెర్న్‌డ్, అవర్ పార్ట్‌నర్‌షిప్స్, డైరెక్షన్స్ ఆఫ్ చేంజ్, అవర్ ప్రయార్టీస్, త్రీ ఎనేబ్లర్స్, ఇన్‌స్టిట్యూషనల్ ట్రాన్స్‌ఫర్మేషన్... అనే అధ్యాయాలు ఉన్నాయి.

'మనం ముఖ్యంగా రెండు విషయాల గురించి ఆలోచించాలి. లింగ సమానత్వం దిశగా పురోగతి ఎందుకు నెమ్మదిగా, చెల్లాచెదురుగా ఉంది. దీనికి పరిష్కార మార్గాలు ఏమిటి? అయితే ఎంత జటిలమైన సవాలు అయినా కొత్త అవకాశాలను అందిస్తుంది. కొత్త వ్యూహాలు రూపొందించుకునేలా చేస్తుంది' అంటూ కార్యాచరణ ప్రణాళికకు ముందు మాట రాశాడు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యుఎన్ డిపి) అడ్మినిస్ట్రేటర్ అచిమ్ స్టెయినర్.

సాక్షి సినిమా

డబుల్ ధమాకా


• శ్రీవిష్ణు

వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో శ్రీవిష్ణు. ఫిబ్రవరి 29న తన పుట్టినరోజుని పురస్కరించుకుని డబుల్ ధమాకా ఇచ్చారాయన. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న రెండు సినిమాల అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు హీరోగా నటించిన చిత్రానికి 'మృత్యుంజయ్' టైటిల్ ఖరారు చేశారు. 'సామజవరగమన' చిత్రం తర్వాత శ్రీవిష్ణు, రెబా జాన్ జంటగా నటించిన చిత్రమిది. రమ్య గుణ్ణం సమర్పణలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా టైటిల్ టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. **ఒంగోలు నేపథ్యంలో...** శ్రీవిష్ణు హీరోగా నూతన దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో కొత్త సినిమాని ప్రకటించారు మేకర్స్. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి. నిర్మించనున్నారు. 'ఒంగోలు పట్టణం నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగుతుంది. శ్రీవిష్ణు హిలేరియస్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: హేమ-షాలిని, సహ నిర్మాతలు: సుబ్రమణ్యం నాయుడు జి, రామాచారి ఎం.


ధైర్యం.. నిజాయితీ


• అనురాగ్ కశ్యప్

అడివి శేష్ హీరోగా నటిస్తున్న ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'డెకాయిట్'. 'ఒక ప్రేమ కథ' అనేది ఉపశీర్షిక. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. షనీల్ డియో దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. నెక్స్ట్ షెడ్యూల్‌ను మహారాష్ట్రలో ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ భాగం అయ్యారని, ఇందులో ఆయన ఇన్‌స్పెక్టర్ స్వామి పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''తెలుగులో నా తొలి సినిమా 'డెకాయిట్'. ధైర్యం, చమత్కారం, నిజాయితీలతో కూడుకున్నది స్వామి క్యారెక్టర్'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు అనురాగ్ కశ్యప్. ఈ సినిమాకు సహ నిర్మాత: సునీల్ నారంగ్.

గొప్ప బహుమతి


• కియారా అద్వానీ


• సిద్ధార్థ్ మల్హోత్రా

బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ, హీరో సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు శుభవార్త చెప్పారు. త్వరలో తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన భర్త సిద్ధార్థ్‌తో కలిసి బేబీ సాక్స్‌ను చేతిలో పట్టుకున్న ఫొటోని సోషల్ మీడియాలో షేర్ చేసి, 'మా జీవితాల్లో గొప్ప బహుమతి.. త్వరలోనే రాబోతోంది' అని వెల్లడించారు కియారా. విష్ణు వర్ధన్ దర్శకత్వం వహించిన 'షేర్షా'(2021) సినిమాలో తొలిసారి కలిసి నటించారు సిద్ధార్థ్ - కియారా. ఆ మూవీ షూటింగ్‌లో వీరి మధ్య ఏర్పడిన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారడంతో 2023 ఫిబ్రవరి 7న వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు కాబోతున్న కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రాలకు సమంత, రాశీఖన్నా, అతియా శెట్టి వంటి పలువురు సినీ సెలబ్రిటీలతో పాటు అభిమానులు శుభాకాంక్షలు చెప్పారు. ఇదిలా ఉంటే.. తెలుగులో మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను', రామ్‌చరణ్‌తో 'వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్' సినిమాల్లో నటించారు కియారా అద్వానీ.

ఆట మళ్లీ ఆరంభం


• రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మల్టీ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విభిన్న రకాల స్పోర్ట్స్ (క్రికెట్, కుస్తీ..) ప్రస్తావన ఉంటుందని తెలిసింది. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. ఆ తర్వాత రామ్‌చరణ్ అండ్ కో షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్నారు. ఈ బ్రేక్‌లో తన నెక్స్ట్ మూవీ స్క్రిప్ట్ విషయాలను చర్చించేందుకు దర్శకుడు సుకుమార్‌తో కలిసి రామ్‌చరణ్ దుబాయ్ వెళ్లారని తెలిసింది. కాగా 'పెద్ది' సినిమా షూటింగ్‌ను తిరిగి ఈ వారంలో ప్రారంభించాలని చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ కొత్త షెడ్యూల్ చిత్రీకరణలో రామ్‌చరణ్‌తో పాటుగా కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా పాల్గొంటారు. జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం. 'పెద్ది' సినిమాని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్.

అగాథియా నిరుత్సాహపరచదు - జీవా


• జీవా

"అగాథియా" వైవిధ్యమైన చిత్రం. హారర్ అంశాలతో పాటు తల్లి సెంటిమెంట్, దేశభక్తి వంటి అంశాలు కూడా ఉంటాయి. ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పొందుతారు. వారిని మా సినిమా నిరుత్సాహపరచదు'' అని జీవా తెలిపారు. ప్రముఖ పాటల రచయిత పా.విజయ్ కథ అందించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అగాథియా'. జీవా, రాశీఖన్నా జంటగా, అర్జున్ సర్జా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అగాథియా'. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కె.గణేష్, అనీష్ అర్జున్ దేవ్ నిర్మించిన ఈ మూవీ తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఫిబ్రవరి 28న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జీవా విలేకరులతో మాట్లాడుతూ–''మూడేళ్ల ప్రయాణం 'అగాథియా'. ఎంతో కష్టపడి భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీశాం. నా పాత్రతో పాటు అర్జున్ సర్, రాశీఖన్నా, ఎడ్వర్డ్ సోన్నెన్‌బ్లిక్... ఇలా అందరి పాత్రలను విజయ్‌గారు అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ కోసం చాలా రోజులు పట్టింది. యువన్ శంకర్ రాజా గారితో నా మూడో సినిమా ఇది. ఈ చిత్రం కోసం అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారాయన. దీపక్ కుమార్ పాడి విజువల్స్ సినిమాకి ప్లస్. 'రంగం' సినిమా నుంచి నన్ను ఎంతో ఆదరిస్తున్న తెలుగు వారికి థ్యాంక్స్. నేను నటించిన స్ట్రైట్ తెలుగు చిత్రం 'యాత్ర 2'కి నటుడిగా మంచి పేరొచ్చింది. తెలుగులో నేరుగా మరో సినిమా చేయాలని నాకూ ఉంది. రచయితలు, దర్శకులు నా కోసం కథ సిద్ధం చేస్తే నేను రెడీ. ప్రస్తుతానికి నా దృష్టి సినిమాలపైనే ఉంది. రాజకీయాల ఆలోచన లేదు'' అని తెలిపారు.